క్లుప్తంగా

గౌరీనగర్‌లో పర్యటించిన డిప్యూటీ మేయర్



బోర్‌వెల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పర్యటించారు. ఇటీవల వేసిన బోర్‌వెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కోఇళ్ల పరిసరాల్లో శుభ్రంగా ఉంచేందుకు ఫ్లోరింగ్ వేయిస్తామని తెలిపారు. అలాగే ఇక్కడి రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణం అందిస్తామని తెలిపారు. అయితే పరిసరాల శుభ్రత అందరి బాధ్యతగా భావించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



స్క్రీన్‌పై ట్రాఫిక్ నిబంధనలు చూస్తున్న ఏసీపీ రాజీవ్ కుమార్, సీఐ మళ్ల అప్పారావు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు మంగళవారం డిజిటల్ స్క్రీన్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై పాదచారులు, వాహనదారులకు అవగాహన కల్పించారు. జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ పర్యవేక్షించారు. వాహనదారులు, పాదచారులతో ఆయన మాట్లాడి ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని కోరారు. ప్రమాదాల నివారణకు పూర్తిగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు, ఎస్ఐ పాపారావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, స్టోరీ టెల్లింగ్‌పై అవగాహన కల్పించారు. అలాగే పొడుపు కథలు గురించి వివరించారు. పలు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గొల్లవిల్లి చైతన్య, రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం పాల్గొన్నారు.

ఆగస్టులో జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు



సమావేశంలో పాల్గొన్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: వచ్చే ఆగస్టు నెలలో జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలను నిర్వహించనున్నట్టు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. పోటీల నిర్వహణకు సంబంధించిన న్యూ పెంటమాంబ జిమ్ క్లబ్ ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకలో నిర్వహించనున్న ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 500 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని తెలిపారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, పతకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిమ్ ప్రతినిధి రామోజీ, కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అమృతకాలం



స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్



ఏయూ మెయిన్ గేట్

- జాతీయస్థాయిలో ఏయూకు అగ్రాసనం
- యువతను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దుతున్న స్టార్టప్‌లు
- పెరుగుతున్న వర్సిటీ పేటెంట్‌ల సంఖ్య

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు చేరువవుతోంది. వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి దార్శనికులు వేసిన బలమైన పునాదులపై నిర్మితమైన విశ్వవిద్యాలయం నేడు మరింత ఉన్నత శిఖరాలను చేరుకుంటోంది. వర్తమాన సాంకేతిక ప్రగతికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే దిశగా ప్రస్తుత ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి చేస్తున్న కృషి సత్ఫలితాలనిస్తోంది. నాలుగేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వర్సిటీకి అమృతకాలంగా చెప్పవచ్చు.

ఆవిష్కర్తలుగా నిలిపే 'ఆ హబ్'

కాలంతోపాటు మనం మారాలి.. అప్పుడే మనుగడ సాధ్యపడుతుంది. ఈ సూత్రాన్ని ఆచరణలో చూపుతోంది ఏయూ. నాలుగేళ్ల కిందట ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఏయూలో స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి సంకల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేని విధంగా స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ 'ఆ హబ్'కి ప్రాణం పోశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సీఈవోను నియమించి.. నేడు వందకు పైగా అంకుర సంస్థలు, 500 మందికి పైగా యువత పనిచేసేలా తీర్చిదిద్దారు. దీనికి చేరువలో రూ.22 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సాయంతో నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించి, మరిన్ని స్టార్టప్‌లకు ఊతం అందించారు.

జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్

జాతీయస్థాయిలో వివిధ సంస్థలు ఇచ్చే వివిధ ర్యాంకుల్లో ఏయూ ముందు వరసలో ఉంటోంది. కేంద్ర మంత్రిత్వ శాఖ అందించే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 43వ స్థానం సాధించింది. ఇటీవల ది వీక్-హన్స్ సర్వేలో జాతీయ స్థాయిలో మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాల విభాగంలో ఏయూ 9వ స్థానాన్ని సాధించింది. అఖిల భారత స్థాయిలో టాప్ 10లో ఏయూ నిలవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షను సాకారం చేసే దిశగా ఏయూ పని చేస్తోంది.

చెయిర్ ప్రొఫెసర్.. ప్రొఫెసర్ ఆన్ ప్రాక్టీస్

యూజీసీ ప్రారంభించే ప్రతీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఏయూ ముందుంటోంది. ఎన్ఈపీ 2020ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే శతశాతం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతకు మరింత బలాన్ని అందించే విధంగా ఏయూ పనిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేనన్ని చెయిర్ ప్రొఫెసర్లను ఏయూ ఇప్పటికే సాధించింది. వివిధ పరిశ్రమలు, సంస్థలు, వ్యక్తుల సహాయంతో దాదాపు 20కి పైగా చెయిర్ ప్రొఫెసర్‌లను ఏర్పాటు చేసింది. విభిన్న రంగాల్లో నిష్ణాతులైన నిపుణులను ప్రొఫెసర్ ఆన్ ప్రాక్టీస్‌గా స్వీకరిస్తూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే ప్రయత్నంలో సఫలీకృతమైంది.

ఐఐసీలో జాతీయస్థాయిలో నాల్గో స్థానం

అఖిల భారత స్థాయిలో అడుగిడిన తొలి సంవత్సరమే ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో జాతీయ స్థాయిలో 4 స్టార్ ర్యాంకింగ్ సాధించింది. కేంద్రీయ, ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు దీటుగా ఏయూ ఈ ర్యాంకును పొందింది.

పేటెంట్‌ల ప్రవాహం

ఏయూలో రెండేళ్ల కిందట ఏర్పాటైన ఐపీఆర్ చెయిర్ ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తోంది. ఇప్పటికే 70కి పైగా పేటెంట్‌లను వర్సిటీ నుంచి దాఖలు చేయడం, పదుల సంఖ్యలో పేటెంట్‌లు సాధించడం చకచకా జరిగిపోయింది. మేథో హక్కులపై విద్యార్థులకు కోర్సును రూపకల్పన చేసి అందించి ఘనత ఏయూకే దక్కుతుంది. రాష్ట్రానికి నోడల్ ఏజెన్సీగా ఏయూ సేవలు అందిస్తోంది. పేటెంట్‌ను కమర్షియలైజ్ చేయడంలో కూడా ఏయూ ముందుంది.

నాడు-నేడుతో భవనాలకు పూర్వ వైభవం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నాడు-నేడు పథకం స్ఫూర్తితో వర్సిటీలో భవనాలు, హాస్టళ్లు పూర్తిస్థాయిలో తమ స్వరూపాన్ని మార్చుకున్నాయి. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన హాస్టల్ భవనాలు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసుకున్నాయి. సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసిన మౌలిక వసతులు, మైదానాలు వర్సిటీకి అతిపెద్ద వనరుగా నిలుస్తున్నాయి. అన్యాక్రాంతమైన వందలాది కోట్లు విలువైన భూములను స్వాధీనం చేసుకోవడంలో అధికారుల చిత్తశుద్ధి సైతం విశాఖ ప్రజల అభిమానాన్ని చూరగొంది. ఫార్మా హబ్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, డిజిటల్ జోన్, డాల్బీ అట్మాస్ రికార్డింగ్ స్టూడియో తదితర ప్రాజెక్టులు వర్సిటీ కీర్తికిరీటంలో కలికితురాళ్లుగా నిలవనున్నాయి.

ఉపాధి అవకాశాల వెల్లువ

వర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థి ఉపాధి అవకాశంతో బయటకు వెళ్లాలనే ఆశయంతో వర్సిటీ పనిచేస్తోంది. ఇప్పటికే ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్, న్యాయ, ఫార్మసీ విభాగాలకు చెందిన మూడు వేల మందికి పైగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఏయూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఈశ్వరీ ప్రియ రూ.84.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించి, రికార్డ్ సృష్టించింది.

అగ్రస్థానంలో ఏయూ.. అదే మా లక్ష్యం



రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు, యువత ఆకాంక్షలకు అనుగుణంగా.. వందేళ్లకు చేరుకుంటున్న ఏయూను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్ర యువతకు మనం అందించే నిజమైన ఆస్తి విద్య అని, యువత ఉపాధి కోసం ఎదురుచూడకుండా, ఉపాధి అవకాశాలను సృష్టించే స్థాయికి ఎదగాలని ఏయూ వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో పిలుపునిచ్చారు. వీటిని సాకారం చేసే దిశగా ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ, న్యాయ కళాశాలలను అనుసంధానం చేస్తూ స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను ఐఐటీలకు దీటుగా ఏర్పాటు చేశాం. శతాబ్ది వేడుకలకు సిద్ధమవుతున్న ఏయూను సాంకేతికతంగా, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో అగ్రస్థానంలో నిలపడం లక్ష్యంగా నాలుగేళ్లుగా పనిచేస్తున్నాం. ప్రభుత్వ పూర్తి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తున్నాం.

– ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, ఉపకులపతి, ఏయూ

అనధికార నిర్మాణంపై ఫిర్యాదు



జనతాకాలనీ వద్ద అనధికార నిర్మాణం

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు జనతాకాలనీ దుర్గాదేవి ఆలయం వద్ద అనధికార నిర్మాణంపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు స్థానిక నాయకుడు సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఇక్కడి ఆలయం వద్ద కొబ్బరికాయల వ్యాపారం చేసుకోవడానికి తాత్కాలిక షెడ్ వేసుకుంటామని చెప్పిన వారు ఇప్పుడు పర్మినెంట్‌గా శ్లాబ్ వేయటంపై ఆ నాయకుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిలో అనధికార నిర్మాణం జరపటం ఏమిటి అని ప్రశ్నించారు. దీనిపై ఆయన జోన్-5 టౌన్‌ప్లానింగ్ అధికారులకు, జోన్-5 జెడ్సీ కృష్ణకు సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమణమూర్తి మంగళవారం జనతాకాలనీ ప్రాంతానికి వచ్చి అక్కడ జరుగుతున్న అనధికార నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణం ఆపాలని అక్కడి వారిని హెచ్చరించారు. మరల నిర్మాణం జరిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

నరవ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



అతిథుల నుంచి బహుమతి అందుకుంటున్న నరవ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు



ప్లాస్టిక్ వ్యర్థాలతో విద్యార్థులు తయారు చేసిన బ్రిక్స్

ప్లాస్టిక్ వ్యర్థాలతో బ్రిక్స్ తయారీ

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లు, ఇసుకతో ఇటుకలు తయారు చేసి తమ ప్రతిభ చాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విజయనగరంలో జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో నరవ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎకో బ్రిక్స్ తయారు చేసి ప్రథమ బహుమతి సాధించారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ ఎక్స్‌పోలో పాల్గొన్నారు. వేస్ట్ మెటీరియల్‌ను ఉపయోగించి నూతన వస్తువులు తయారు చేయాలన్న నియమంతో ఈ బ్రిక్స్ తయారు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిమిరెడ్డి వీరు నాయుడు పర్యవేక్షణలో విద్యార్థులు యశ్వంత్, ఉపేంద్ర, సురేంద్ర, మురళీ, గణేష్‌మౌళి, గౌతమి ఈ ప్రాజెక్ట్ చేశారు. వాడి పడేసిన వాటర్ బాటిళ్లు, ఇసుకతో ఈ బ్రిక్స్ తయారు చేశారు. వీరికి జేఎన్‌టీ యూ జీవీ ప్రిన్సిపాల్ శ్రీకుమార్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ టి. సుదర్శనం బహుమతి అందించారు. ఈ మేరకు విద్యార్థులను మంగళవారం నరవ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, అధ్యాపకులు అభినందించారు.

ముంపు ప్రాంతాలను గుర్తించండి: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట: రాబోయే వర్షా కాలంలో వరద నిర్వహణకు లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించాలని విశాఖ రెవెన్యూ డివిజినల్ అధికారి (ఆర్‌డీవో) డి. హుస్సేన్ సాహెబ్ అధికారులను ఆదేశించారు . మంగళవారం సాయంత్రం తన చాంబర్లో 2023 నైరుతి-పశ్చిమ రుతుపవనాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎలక్ట్రికల్, మెడికల్, మున్సిపల్, వ్యవసాయం, పశుసంవర్ధక, అగ్నిమాపక, టెలికమ్యూనికేషన్ తదితర శాఖల సమన్వయంతో సమావేశం నిర్వహించాలన్నారు. తుపాను షెల్టర్ల పరిస్థితిని పరిశీలించి మరమ్మతులుంటే వెంటనే సరి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సంబంధిత ప్రదేశాల్లో తగినంత మందుల నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య శాఖ అధికారులకు తెలిపారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వైద్య, అగ్నిమాపక, రోడ్లు – భవనాలు, ఇతర శాఖలకు సంబంధించిన అధికారుల సమన్వయంతో మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు . జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి, తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో మనోరంజిని, మెడికల్, జీవీఎంసీ, పోలీస్ శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామికి పూజలు

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డునూ ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో కొలువు దీరిన వేంకటేశ్వరసామికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి 21వ కల్యాణ మహోత్సవం సందర్భంగా జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, గ్రామస్తులు,పెద్దలు పాల్గొని పూజలు జరిపా రు. ఈ సందర్భంగా నిర్వాహకులు మందిరం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు రామ్మోహన్‌నాయుడు పాల్గొని కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిత్తిరెడ్డి శంకర్, పెద్దాడ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న లావణ్య

మల్కాపురం : సాంస్కృతిక అంశాలైన నాటికలు, నృత్యాలు, కళారూపాల ద్వారా సామాజిక సమస్యలపై ప్రజలకు అవగహన కలిగించాలని ఎన్ఎస్ఎస్ కార్యకర్త కె.లావణ్య అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని రూపుమాపడానికి కళా రూపాలను ఉపయోగించుకోవాలన్నారు. అందుకే చిన్నారులు చిన్న చిన్న నాటికలు, నృత్య రూపకాలను నిరంతరం అభ్యసించాలన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన చిన్నారులకు ఆమె నృత్యాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రచయిత కె.సత్తిరాజు, కార్మిక సంఘ నాయకుడు బి.సత్యనందం తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం విశేషంగా ఆర్జిత సేవలు జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంప జేసి అష్టోత్తరశతనామావళిపూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

8న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

అతిసార నియంత్రణ పక్షోత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈనెల 5 నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 17 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. వేసవి మొదలుకుని వర్షాకాలం వరకు అతిసార బారిన పడే ప్రమాదమున్నందున అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల వయసు పిల్లలున్న ప్రతి ఇంటికి ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం వెళ్లి జింక్ మాత్రలు సరఫరా చేస్తారని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రం, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ గోడపత్రిక అన్ని ఆరోగ్య కేంద్రాలలో ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు బి.జ్యోతి, ధర్మేంద్ర, మురళీకృష్ణ, శశిభూషణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అంశంలో విపక్షాల రాజకీయం'



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి తిరుపతిరావు

ఉక్కునగరం: ఉక్కు కర్మాగారాన్ని అభివృద్ధి చేయడం బీజేపీ వల్లే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ అంశంలో విపక్షాలు రాజకీయం చేస్తున్నాయన్నారు. ఉక్కునగరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 41 నుంచి 47 వరకు బూత్ కమిటీలను నియమించి సరళ్ యాప్ నమోదు చేశారు. పలువురు ఓటర్లను కలిసి ఓటు నమోదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, మండల అధ్యక్షుడు పి. నాగేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు విశాల్, ప్రధాన కార్యదర్శి జగ్గారావు, మహంతి తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న బీజేపీ'

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఇటువంటి ప్రభుత్వాల ఉనికి ప్రశ్నార్థకం కాక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 845వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి పేద, బలహీన వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదల జీవితాలను నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు సత్కారం



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

మహారాణిపేట: కేజీహెచ్ వైఎస్సార్ టీయూసీ యూనియన్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కింగ్ జార్జి ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ శివానందను సన్మానించారు. ఒక దళిత బిడ్డ కేజీహెచ్ సూపరింటెండెంట్ కావడం ఆనందంగా ఉందన్నారు. కేజీహెచ్ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి ఆయన పాటు పడతారని యూనియన్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వి. లక్ష్మణ, నాయకులు రమణ, పి. వెంకట్రావు, ఎస్. రాజారావు, సీహెచ్ లీలాకృష్ణ, బి. పార్వతి, ఎస్.కె. బేగం, డి. రాజేశ్వరి, జి. అప్పారావు, సెక్రటరీ కె. రామారావు, నూకరాజు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నర్సుల అభినందన : కేజీహెచ్ నూతన సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను ప్రభుత్వ నర్సుల సంఘం నాయకురాళ్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. డి.లక్ష్మి, పిట్ల వరలక్ష్మి, పి.ప్రశాంతి, వి.ఉషారాణి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన



రక్తదానం చేస్తున్న మెగాస్టార్ చిరంజీవి అభిమానులు

మహారాణిపేట: రైలు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితుల కోసం జిల్లా పరిషత్ వద్ద గల రెడ్ క్రాస్ సొసైటీలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి పిలుపు మేరకు సిద్ధార్థరాయ్ చిత్రం ద్వారా హీరోగా రాబోతున్న హీరో దీపక్ సరోజ్ ముందుకు వచ్చారు. బాల నటుడిగా ఎన్నో చిత్రాల్లో నటించిన దీపక్ సరోజ్ చిరంజీవిపై గల అభిమానంతో రెడ్ క్రాస్ సొసైటీ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. భారీ ఎత్తున మెగా అభిమానులు శిబిరానికి హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దాతల నుంచి రెడ్ క్రాస్ సొసైటీ వైద్య బృందం రక్తాన్ని సేకరించింది. ఈ సందర్భంగా వర్ధమాన హీరో దీపక్ సరోజ్ మాట్లాడుతూ మెగా రక్తదాన శిబిరానికి భారీ సంఖ్యలో రక్తదాతలు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సుమారు 270 మంది రక్తదానం చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకుడు యల్లజీరావు, కొయిరాల శ్రీనివాస్‌రావు, నరసింగరావు, సందీప్, శశికళ, సంధ్య, వైదేహి పాల్గొన్నారు.